సాక్షి
వికారాబాద్

శనివారం ၊ 7 ၊ డిసెంబర్ ၊ 2024



ఇంకా పాత పింఛన్లే..

కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాదైనా పింఛను మొత్తం పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 8లో ▶



సమస్యలు పరిష్కరించాలి

గురుకులాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. 8లో ▶



ఓవర్ లోడ్‌కు చెక్

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఆశాఖ అధికారులు ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. 9లో ▶

న్యూస్‌రీల్

నరేందర్‌రెడ్డికి రెండు రోజుల పోలీసు కస్టడీ

న్యాయవాదుల సమక్షంలో విచారణకు కోర్టు అనుమతి

కొడంగల్: లగచర్ల ఘటన కేసులో ఏ–1 నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని రెండు రోజుల పోలీస్ కస్టడీకి న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. ఇప్పటికే చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నరేందర్‌రెడ్డిని విచారించేందుకు కస్టడీ అనుమతి కోరుతూ పోలీసులు వేసిన పిటిషన్‌పై శుక్రవారం కొడంగల్ కోర్టులో విచారణ జరిపిన న్యాయమూర్తి శనివారం, ఆదివారం న్యాయవాదుల సమక్షంలో విచారించేందుకు అనుమతి ఇచ్చారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

అనంతగిరి: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యా నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు రిలే నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన మాటను నిలుపుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఈ నెల 10 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు ప్రకటించారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, ప్రభావతి, స్వరూప, ప్రవంతి, ఆశలతా, మంగమ్మ, శైలజ, రాజేశ్వరి, అనిల్, జంగయ్య, రాఘవేందర్, ప్రమోద్, నర్సిరెడ్డి, నజీర్, రాగిణి, మీన, గౌస్ మోహన్, ప్రశాంత్, వీరమణి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

అనంతగిరి: రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ మండిపడ్డారు. శుక్రవారం వికారాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను గృహ నిర్బంధం చేశారు. ఆయనతో పాటు పలువురిని ముందస్తు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. ఎన్ని కేసులు పెట్టినా వెనుకడుగు వేసేదిలేదన్నారు. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల సూచనలు వినే పరిస్థితిలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లేదన్నారు. అరెస్టయిన వారిలో ఏఎంసీ మాజీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, వైస్ చైర్మన్ చంద్రశేకర్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం



అనంతగిరి: శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డు పాత్ర ఎంతో ఉంటుందని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో హోంగార్డ్స్ రైసింగ్ డేను పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు శాఖలో భాగమై పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఏ స్పీ హనుమంత్‌రావు, ఆర్‌ఐ డేవిడ్, అంజత్‌పాషా, ఆర్ఎస్ఐలు, జిల్లా హోంగార్డుల సంఘం అధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చాంద్‌పాషా పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఏఎస్పీ

వికారాబాద్ ఏఎస్పీగా బదిలీపై వచ్చిన టీవీ హనుమంతరావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్న అనంతరం ఎస్పీ నారాయణరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శాంతి భద్రతలపై చర్చించారు.

పడిగాపులే..

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం.. సర్కారు ఆస్పత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలి.. అన్ని రకాల మందులు, పరికరాలు అందుబాటులో ఉన్నాయి.. ప్రతి సమావేశంలో పాలకులు, అధికారులు చెప్పే మాటలివే.. పీహెచ్‌సీల్లో మందుల పరిస్థితి బాగానే ఉన్నా.. కొంతమంది వైద్యాధికారులు సమయపాలన పాటించకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు, వసతులు, పరీక్షలపై శుక్రవారం 'సాక్షి' విజిట్ చేయగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి.



ఉదయం 9గంటలు దాటినా ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న నాగసమందర్ పీహెచ్‌సీ

వైద్యుల కోసం గంటల తరబడి నిరీక్షణ

- ఓపికలేక వెనుదిరుగుతున్న రోగులు
- స్థానికంగా ఉండని డాక్టర్లు, సిబ్బంది
- పట్టించుకోని ఉన్నతాధికారులు

సాక్షి విజిట్

ధారూరు: మండలంలోని నగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సమయపాలన పాటించడం లేదు. దీంతో వైద్యం కోసం రోగులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. స్థానికంగా ఉండాల్సిన వైద్యులు, సిబ్బంది హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. నగసమందర్ పీహెచ్‌సీని శుక్రవారం సాక్షి విజిట్ చేయగా రోగుల అవస్థలు వెలుగుచూశాయి. ఉదయం 9 గంటలకు రావాల్సిన డాక్టర్, సిబ్బంది రాలేదు. ఆయుష్ అటెండర్ మాత్రమే ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నారు. రోగంతో వచ్చా.. ఎంతసేపని వేచిచూడాలి.. మీకు తెలిసిన మాత్ర ఇవ్వు, వేసుకుని ఉపశమనం పొందుతా అని రోగులు ఆయుష్ అటెండర్‌ను వేడుకోవడం కనిపించింది. ఏఎన్‌సీ పరీక్షల కోసం గరిగోపుల గ్రామం నుంచి గర్భిణులు ఆసుపత్రికి రాగా 9:24 గంటలకు వచ్చిన సూపర్‌వైజర్, ఏఎస్ఎంలు రోగుల పేర్లను నమోదు చేసుకున్నారు. ఉదయం 10:55 గంటలకు వచ్చిన డాక్టర్ మాధవి సేవల్లో నిమగ్నమయ్యారు. గర్భిణులు, బాలింతలు డాక్టర్ కోసం రెండు గంటల పాటు నిరీక్షించారు. ఆసుపత్రిలో మందుల కొరత లేదని ఆమె తెలిపారు.



ఆస్పత్రికి వస్తున్న గర్భిణి, మహిళ, రోగులు

మాగోడు ఎవరికి చెప్పుకోవాలి



రోగంతో ఉదయం 9గంటలకే ఆసుపత్రికి వచ్చా. గంట సేపు డాక్టర్ కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. అయినా రాకపోవడంతో సూపర్‌వైజర్‌తో మాత్రలు తీసుకుని వెళ్లిపోయా. మాగోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. వైదులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎర్రోళ్ల బసప్ప

వరండాలో విధులు



వరండాలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ పల్లె దవాఖానాలో సరైన వసతులు లేక వైద్య సిబ్బంది అవస్థలు పడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో వరండాలో విధులు నిర్వహిస్తున్నారు. వైద్యశాలలో వసతులపై డాక్టర్ నిర్మలను 'సాక్షి' ప్రశ్నించగా భవనం శిథిలావస్థకు చేరిందని, అందులో విధులు నిర్వహించాలంటే భయంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఒకే గది అందుబాటులో ఉండటంతో మందులు మూలాన పడేయాల్సి వస్తోందన్నారు. గది నుంచి దుర్గంధం వస్తుండటంతో వరండాలో వైద్యం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి బుధవారం గర్భిణులు, బాలింతలు చికిత్స కోసం వస్తుంటారని వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంజక్షన్ల కొరత



రోగిని పరీక్షిస్తున్న బస్తీ దవాఖానా వైద్యుడు

తాండూరు టౌన్: పట్టణ పరిధిలోని పాత తాండూరు బస్తీ దవాఖానాలో ఒంటి నొప్పుల ఇంజక్షన్లు కరువయ్యాయి. కొన్ని రోజులుగా ఇంజక్షన్లు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం బస్తీ దవాఖానాకు సగటున 140 మంది వరకు వస్తుంటారు. అయితే వ్యాధుల సీజన్ తగ్గిన సమయంలో 90 మంది వరకు వచ్చి చికిత్స పొందుతుంటారు. బస్తీ దవాఖానాలో ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ వంటి వైద్య పరికరాలు అందుబాటులో లేవు. కేవలం రక్త, మూత్ర పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఒంటి నొప్పుల ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విద్యప్రియ

కొడంగల్ రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు విద్యప్రియ సూచించారు. ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ వైద్య పరిరాలు లేవని, అవసరమైన వారికి బ్లెడ్, యూరిన్ టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. రోజు 40మంది రోగులకు పరీక్షలు నిర్వహిస్తూ మందులు అందజేస్తున్నట్లు చెప్పారు.

అందుబాటులో మందులు



థైరాయిడ్ పరీక్ష కోసం రక్త నమూనాలు సేకరిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

యాలాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేస్తున్నారు. 24 గంటల అనంతరం రక్త, మూత్ర పరీక్షల రిపోర్టులు అందజేస్తున్నారు. కొద్ది రోజుల నుంచి థైరాయిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దగ్గు, జలుబు,జ్వరం,పాము,తేలు,కుక్క కాటు మందులు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల కొత్తగా విధుల్లో చేరిన వైద్యురాలు రోగులకు అందుబాటులో ఉంటున్నారు. ఆపరేషన్ గది దెబ్బతింది. ఆయుర్వేద వైద్యుడి పోస్టు ఖాళీగా ఉంది.

రోగులకు ఇబ్బంది లేకుండా వైద్యం



కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రజిత

దోమ: దోమ పీఎచ్‌సీలో రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్యం అందిస్తున్నారు. శుక్రవారం దోమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సాక్షి విజిట్ చేసింది. వైద్యాధికారి రజిత.. ఏఎస్ఎంలు, ఆశ వర్కర్లకు కుష్టువ్యాధి, చిన్నారుల టీకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.



అల్పాహారం పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ్మా, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

వికారాబాద్ పాలమూరుకు మహర్దశ

రేవంత్ సీఎం కావడం కొడంగల్ ప్రజల అదృష్టం

- అభివృద్ధి పనులకు పెద్ద మొత్తంలో నిధుల మంజూరు
- రాష్ట్ర మంత్రులు జూపల్లి, దుద్దిళ్ల, దామోదర

కొడంగల్: రేవంత్‌రెడ్డి సీఎం కావడం కొడంగల్ ప్రజల అదృష్టమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ్మా, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన సెంట్రలైజ్‌డ్ కమ్యూనిటీ కిచెన్‌ను వారు ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు కొడంగల్‌లోనే శంకుస్థాపన చేశారు. కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల్లో రూ.20 కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దుద్యాల్, కొత్తపల్లి, గుండుమాల్ మండలాల్లో సమీకృత మండల కార్యాలయాల భవన నిర్మాణాలకు(ఒక్కో మండలానికి రూ.9 కోట్లతో) భూమి పూజ చేశారు. రూ.75 కోట్లతో పలు మండలాల్లో చేపటనున్న అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉమ్మడి పాలమూరు జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కొడంగల్‌తో పాటు వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా కొడంగల్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలో 28 వేల మంది విద్యార్థులకు రోజూ ఉదయం అల్పాహారం అందించే పథకానికి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్, వయాట్రీస్ సంస్థ, సింగరేణి సంస్థల సహకారంతో పేద విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించడానికి చర్యలు తీసుకున్నారని అన్నారు. ప్రభుత్వంపై భారం పడకుండా సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబిలిటీ) నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హరేకృష్ణ చారిటబుల్ ట్రస్టుకు బాధ్యతను అప్పగించినట్లు పేర్కొన్నారు. అన్ని వసతులతో కూడిన వంటశాలను నిర్మించినట్లు తెలిపారు. తెలంగాణలో పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు పౌష్టికాహారం అందించడానికి సీఎం ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ తెలంగాణ అధ్యక్షుడు శ్రీ సత్య గౌర చంద్ర దాస ప్రభుజీ, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, ఈర్లపల్లి శంకర్, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, వయాట్రీస్ సంస్థ ఇండియా సీఎస్ఆర్ హెడ్ మిచెల్ డొమినికా పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

తాండూరు: రానున్న మూడు నెలల్లో ప్రతి ఇంటికీ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాతాశిశు ఆస్పత్రిలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన క్యాంటిన్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. రూ.23.92 కోట్ల రుణ చెక్కును సంఘాల ప్రతినిధులకు అందజేశారు. అంతకుముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మి రెండు సార్లు అవకాశం ఇస్తే కుటుంబ పాలన సాగించి రూ.7లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ చేసిన పాపానికి ఆరు గ్యారంటీల అమలులో కొంత ఆలస్యం జరిగిందన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజల సంక్షేమం కోసం రూ.61 వేల కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అనంతరం శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో వేగంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిర మహిళా శక్తి పథకం రుణాలతో ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, డీసీహెచ్ఎస్ ప్రదీప్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిశంకర్, కమిషనర్ విక్రంసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్, నాయకులు సంపత్‌కుమార్, నర్సింహులు, అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు.



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

బిల్లులు మహాప్రభో

గత ప్రభుత్వ హయాంలో మన ఊరు–మన బడి పనులు

- పనులు పూర్తయి ఏడాదిన్నర దాటినా అందని బిల్లులు
- అప్పులపాలయ్యామంటున్న ఎస్ఎంసీ చైర్మన్లు
- జిల్లాలో మొత్తం పాఠశాలలు 1,130
- మొదటి విడతలో 371 బడుల ఎంపిక
- పనులు పూర్తయినవి 62 పాఠశాలలు
- మంజూరైన బిల్లులు రూ.21.94 కోట్లు
- బకాయిలు రూ.10.35 కోట్లు

వికారాబాద్: గత ప్రభుత్వ హయాంలో మన ఊరు మన బడి పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు ఏడాదిన్నర దాటినా అందడం లేదు. ఎస్ఎంసీ చైర్మన్లు, సర్పంచులు, వార్డు సభ్యులు ఈ పనులు చేపట్టారు. బిల్లుల కోసం హెచ్ఎంలు, ఎంఈఓ, డీఈఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మూడేళ్ల క్రితం పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం మన ఊరు మన బడి కార్యక్రమం ప్రారంభించారు. పనులను కాంట్రాక్టర్లకు కాకుండా ఎస్ఎంసీ కమిటీల ద్వారా నిర్వహించారు. పనులు పూర్తయి ఏడాదిన్న దాటింది. ప్రభుత్వం మారడంతో బిల్లులు ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని పక్కన పెట్టి అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ఆరు నెలల క్రితం కొత్త కార్యక్రమం చేపట్టింది. జిల్లాలో 1,130 పాఠశాలలు ఉండగా మన ఊరు మన బడి కార్యక్రమంలో పూర్తి చేసిన 62 పాఠశాలల మినహా మిగతా స్కూళ్లన్నింటినీ అమ్మ ఆదర్శ పాఠశాలల కింద తీసుకున్నారు. చేపట్టిన పనులను ఆరు నెలల్లో పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లులను దాదాపు చెల్లించారు. అయితే ఏడాదిన్నర క్రితం బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులకు మాత్రం బిల్లులు ఇవ్వలేదు. అప్పులు చేసి పనులు చేపట్టామని ఎస్ఎంసీ చైర్మన్లు, సర్పంచులు, వార్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దోమ మండలం బొంపల్లి పాఠశాలలో మన ఊరు మనబడిలో భాగంగా చేపట్టిన పనులు

పెండింగులో రూ.10.35 కోట్లు

జిల్లాలో మూడేళ్ల క్రితం పాఠశాలల్లో చేపట్టిన మన ఊరు మన బడి పనులకు సంబంధించి దాదాపు రూ.10.35 కోట్లు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 1,130 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా మూడింట ఒకటో వంతు చొప్పున మొదటి విడతలో 371 పాఠశాలలను ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. బిల్లులు సకాలంలో అందకపోవడంతో పనులు నత్తనడకన సాగాయి. రెండున్నర ఏళ్లపాటు కార్యక్రమం కొనసాగగా ఇందులో కేవలం 62 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి రూ.21.94 కోట్లు విడుదల చేయగా రూ.2.5 కోట్ల జాతీయ ఉపాధి హామీ పథకం కింద రావాల్సిన బిల్లులు కలుపుకొని మొత్తం రూ.24.4 కోట్లు అప్పటి ప్రభుత్వం చెల్లించింది. మరో రూ.10.35 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి తమకు బిల్లులు చెల్లించాలని ఎస్ఎంసీ చైర్మన్లు కోరుతున్నారు.

రూ.25 లక్షలు చెల్లించాలి



మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా మా గ్రామ పాఠశాలను ఎంపిక చేశారు. ప్రహరీ, ఫర్నీచర్, విద్యుత్, తాగునీరు, ఫ్లోరింగ్, బాత్ రూంల నిర్మాణం వంటి పనులు చేపట్టాం. ఈ పనులకు సంబంధించి రూ.25 లక్షలు రావాల్సి ఉంది. అప్పులు చేసి పనులు చేపట్టాం. వడ్డీలు కట్టలేక దవాఖా తీస్తున్నాం. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

– చంద్రశేఖర్, వార్డు మాజీ సభ్యుడు, బొంపల్లి

ప్రభుత్వానికి నివేదించాం



జిల్లాలో మన ఊరు మన బడి పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి రూ.10 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. పాఠశాలల వారీగా ఎంతంత డబ్బు రావాలో బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు విడుదలైన వెంటనే చెల్లిస్తాం.

– రేణుకాదేవి, డీఈఓ

క్లుప్తంగా

వైభవంగా పీర్ల జాతర


జాతరలో పాల్గొన్న భక్తులు

తాండూరు రూరల్: కోటబాసుపల్లి గ్రామ శివారులోని గుంటం పీర్ల జాతర వైభవంగా సాగింది. శుక్రవారం గ్రామస్తులు పీర్లకు గంధం సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాలకు అతీతంగా వేడుకల్లో పాల్గొన్న స్థానికులు భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. సిటీ కేబుల్ ఎండీ నర్సింహారెడ్డి ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ స్వరూప వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచు కుర్వ నాగర్జున, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మొగులప్ప, పంచాయతీ కార్యదర్శి లాలప్పతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. ఆన్‌లైన్ ఓటింగ్ వేదికగా కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా యువజన విభాగం మండల అధ్యక్షుడిగా చింతకాయల జంగయ్య ఎన్నికయ్యారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో జంగయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ అభ్యున్నతికి యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాల్లో రాణించి వ్యవస్థ అభ్యున్నతిలో పాలుపంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనందం, కృష్ణయ్య, సోమలింగం, లక్ష్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

నవాబుపేట: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి అంబేడ్కర్ జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శం అన్నారు. ఆయన ఆశయాలు, ఆలోచన విధానాన్ని భావితరాలకు పంచాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

దౌల్తాబాద్: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. మండల పరిధిలోని నర్సాపూర్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బెన్నూరు శివారులో..

యాలాల: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను యాలాల పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. ఎస్ఐ గిరి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బెన్నూరు శివారులో ఇసుక లోడ్‌తో ప్రయాణిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసుల తనిఖీల్లో గుర్తించి పట్టుకున్నారు. ఎటుంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి పీఎస్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇంకా పాత పింఛన్లే..

ఏడాది గడిచినా అమలు కాని కాంగ్రెస్ హామీ

- నేటికీ నిర్ణయం వెల్లడించని ప్రభుత్వం
- ఎదురు చూపుల్లో లబ్ధిదారులు



దౌల్తాబాద్: అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ఇచ్చింది. ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది గడిస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, ఎయిడ్స్, బోధకాల బాధితులు, డయాలసిస్ పేషంట్లకు నెలకు రూ.2016 ప్రతీ నెల పెన్షన్ అందించింది. ఈ పెన్షన్‌ను రూ.4వేలకు పెంచుతామని, దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు ఇ స్తామని ప్రకటించింది. వరుస ఎన్నికలు రావడంతోనే కొంత ఆలస్యం జరిగిందని పలువురు నాయకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచాలని లబ్ధిదారులు కోరుతున్నారు. మండల పరిధిలోని 33 గ్రామ పంచాయతీల్లో 12వేల రకాల పెన్షన్‌లున్నాయి. వీరంతా పెన్షన్ ఎప్పుడు పెంచుతారో అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

నిర్ణయం తీసుకోని ప్రభుత్వం

పెన్షన్‌ల పెంపుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రెండు రోజుల క్రితం మంత్రి సీతక్క పెన్షన్‌ల పెంచుతామని చెప్పినప్పటికీ ఎటువంటి స్పష్టత లేదు. నేటికీ మార్గదర్శకాలు సైతం విడుదల కాకపోవడంతో లబ్ధిదారులకు పెంచుతారా లేదా అనే సంశయంలో ఉంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి పథకంలో 200యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ కింద రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ల వంటి వాటిపై ఎక్కువ దృష్టి సారించింది. కానీ పెన్షన్‌ల పెంపుపై దృష్టి సారించినట్లు కనిపించడంలేదు. ఎన్నికల్లో హామీ ప్రకారం పెన్షన్ పెంచాలని ప్రతిపక్షాలు, లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వైద్యం

- అర్హత, అనుమతులు లేకుండా చికిత్సలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్


గ్లోబల్ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్

పరిగి: అర్హత, అనుమతులు లేకుండా చికిత్సలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని పలు ఆస్పత్రులు, క్లినిక్‌లను అధికారులతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రాజు అనే వ్యక్తి ఎటువంటి విద్యార్హత లేకుండా డాక్టర్‌గా చలామణి అవుతూ తాను నిర్వహిస్తున్న గ్లోబల్ క్లినిక్‌ను సీజ్ చేశారు. లోటస్ క్లినిక్, లోటస్ డెంటల్ క్లినిక్‌లకు రిజిస్ట్రేషన్ లేనందున నోటీసులు జారీ చేశారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. అర్హత లేకుండా వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దన్నారు. విద్యార్హత లేకుండా వైద్యం ఎలా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత ఉన్నవారు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాతే ఆస్పత్రులను నడపాలని సూచించారు. లేదంటే అటువంటి ఆస్పత్రులపై సైతం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వైద్యాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

9న కౌన్సెలింగ్

అనంతగిరి: జిల్లాలోని వైద్యశాఖలో ఖాళీగా ఉన్న 23 ఎంఎల్‌హెచ్‌పీ అభ్యర్థుల మెరిట్ జాబితా, సెలక్షన్ జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో వికారాబాద్.తెలంగాణ.జీఓవీ.ఇన్‌లో పొందుపర్చడం జరిగిందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరవణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలెక్ట్ అయిన అభ్యర్థులకు 9వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

ఓరియంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో అశోక్‌కు చోటు


అశోక్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రులు

దౌల్తాబాద్: మండల పరిధిలోని యాంకి గ్రామానికి చెందిన చిత్రకారుడు సున్నపు అశోక్ ఓరియంట్ బుక్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకున్నారు. ఈయన సూక్ష్మ చిత్రకళలో సిద్ధహస్తుడు. గతంలో చిత్రకళలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు అవార్డులు దక్కించుకున్నారు. మరోసారి ఓరియంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు స్థానం దక్కడంతో ఆ సంస్థ సీఈఓ సర్టిఫికెట్ అందించారు. శుక్రవారం కొడంగల్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ఈ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

గొర్రెల కాపరిని బెదిరించేందుకు..

షాబాద్: తన పొలంలో గొర్రెలు మేపుతున్నాడనే ఆగ్రహంతో యజమాని ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపాడు. ఈ ఘటన మండల పరిధిలోని ముద్దెంగడూలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. నార్సింగికి చెందిన రియాజ్ ముద్దెంగూడలో పొలం కొనుగోలు చేశాడు. ఈ పొలంలో గ్రామానికి చెందిన గొర్రెల కాపరి లక్ష్మీనారాయణ జీవాలను మేపుతుండగా గమనించిన రియాజ్ తన పొలంలో ఎందుకు మేపుతున్నావంటూ ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపాడు. దీంతో ఆందోళనకు గురైన కాపరి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు రియాజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తన పొలంలో జరిగిన నష్టానికి విసిగి ఆగ్రహంతో కాల్పులు జరిపినట్లు తెలిపాడు. ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

షాబాద్: ఇంట్లోంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పటేల్‌గూడలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మాల సురేశ్(35) నెల రోజుల క్రితం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో సురేశ్ తండ్రి రాములు శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. అదృశ్యమైన వ్యక్తి ఎత్తు 5.7, ఎరుపు రంగు టీ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజా ఉద్యమాలకు సిద్ధమవ్వండి

ఇబ్రహీంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలకు సిద్ధమవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామేల్, యాదయ్య, బి.మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఎం మూడో మహాసభలను స్థానిక పాషానరహరి స్మారక కేంద్రలో నిర్వహించారు.

అసైన్డ్ భూముల వివరాలివ్వండి

- తహసీల్దార్‌ను కోరిన మైన్స్ ఏడీ సత్యనారాయణ
- లోకాయుక్తకు నివేదిక సమర్పించనున్న మైన్స్, రెవెన్యూ అధికారులు


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మైన్స్ ఏడీ సత్యనారాయణ

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలోని అసైన్డ్ భూముల వివరాలు ఇవ్వాలని మైన్స్ ఏడీ సత్యనారాయణ కోరారు. శుక్రవారం ఆయన తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తారాసింగ్‌తో భేటీ అయ్యారు. మల్కాపూర్ శివారులో సర్వేనెంబర్-75లోని అసైన్డ్ భూమిని ప్రభుత్వం గతంలో పేదలకు ఇచ్చింది. గ్రామానికి చెందిన కొత్తూరు శాంతకుమార్‌కు చెందిన అసైన్డ్ భూమిలో కొందరు నాపరాతి గనులను అక్రమంగా తవ్వుతున్నారని హైదరాబాద్‌లోని లోకాయుక్తకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు మైన్స్ ఏడీ సత్యనారాయణ నవంబర్ 28న అసైన్డ్‌భూమిలో తవ్వకాలు చేపట్టిన గని భూమిని పరిశీలించారు. అక్రమంగా ఉన్న విద్యుత్ కనెక్షన్ తొలగించారు. లోకాయుక్తకు నివేదిక పంపించేందుకు శుక్రవారం తహసీల్దార్ తారాసింగ్‌ను కలిసి మల్కాపూర్‌లో అసైన్డ్‌భూముల వివరాలు తీసుకున్నారు. మైన్స్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా విచారణ చేసి లోకాయుక్తకు నివేదిక పంపిస్తామని మైన్స్ ఏడీ తెలిపారు. ఆయన వెంట మైన్స్ సర్వేయర్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ నాగలక్ష్మి, రెవెన్యూ డీటీ సందీప్‌కుమార్ ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


మగ్గం శిక్షణను పరిశీలిస్తున్న శకుంతల

మహిళా సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షురాలు శకుంతల

తాండూరు రూరల్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని మహిళా సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షురాలు శకుంతల అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెంగోల్‌లో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో యువతులకు ఉచితంగా టైలరింగ్, మగ్గం శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ.. 2023-24లో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో 6,702 మంది మహిళలకు పలు రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చామన్నారు. టైలరింగ్, మగ్గం, అగర్‌బత్తిల తయారీ, డీటీపీ, సెల్‌ఫోన్ రిపేరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు కుమారి, మహిళలు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ పాలనలోనే అక్రమ అరెస్టులు'


మాట్లాడుతున్న గిరిజన నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అక్రమ అరెస్టులు, రౌడీషీట్‌లతో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని కాంగ్రెస్ గిరిజన విభాగం జిల్లా కమిటీ చైర్మన్ శ్రీనునాయక్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిరిజన నాయకులు మాట్లాడుతూ... పదేళ్ల పాలనలో ప్రశ్నించే గొంతులను నొక్కింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ప్రశ్నించే రైతులు, జర్నలిస్టులు, మహిళలపై అక్రమ కేసులను బనాయించి రౌడీషీట్లు నమోదు చేయించిన ఘనత వారిదే అన్నారు. రాంబల్ నాయక్ నీపై రౌడీషీట్ ఏ ప్రభుత్వం హయాంలో ఏ నాయకుడు నమోదు చేయించాడు? ఏ నాయకుడు మీ భూములు, ఆస్తులను కాజేశాడో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వం ఎంతమందిపై అక్రమ కేసులు బనాయించిందో లెక్కలతో సహా బయటకు తీస్తామని అన్నారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలపై ఒక్కసారి మాట్లాడని రాంబల్ నాయక్ బీఆర్ఎస్ అధికారం పడిపోగానే ఎల్‌హెచ్‌పీఎస్ అవతారమెత్తడం వెనుక డ్రామాలు అందరికి తెలుసు అన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ హోదాలో గిరిజన జాతిని బీఆర్ఎస్ కార్యక్రమాలవైపు పిలుపునివ్వడం సిగ్గుచేటన్నారు. కష్టకాలంలో ఉన్న నిన్ను ఆనాడు ఎవరు ఆదుకున్నారో మర్చిపోయావాఅని ప్రశ్నించారు. మా నాయకుడు కార్యకర్తల ఆస్తులు గుంజుకునేవారు కాదని, కార్యకర్తల స్థాయిని పెంచేవారిన అన్నారు. జాతి పేరుతో బీఆర్ఎస్‌కు ఊడిగం చేయాలనుకోవడం మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో గిరిజన నాయకులు నెహ్రూ పవార్, రూప్లానాయక్, రవీందర్‌నాయక్, బాలునాయక్, ప్రేమ్‌నాయక్, నారాయణ, తులసీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం బాగాలేదని..

- సూసైడ్ నోట్ రాసి.. హాస్టల్ గదిలో ఉరేసుకుని..
- అనుమానాస్పద స్థితిలో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య
- కళాశాల ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన


కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు


శ్రావణి (ఫైల్)

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో బీటెక్ విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం మైలారం కొత్త తండాకు చెందిన బలరాం నాయక్, కవితలకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు శ్రావణి (18) దుండిగల్‌లోని మర్రి లక్ష్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ కళాశాలలోని హాస్టల్‌లో ఉంటోంది. రెండు రోజుల క్రితం తన స్వగ్రామానికి వెళ్లి తిరిగి హాస్టల్‌కి వచ్చిన శ్రావణి.. శుక్రవారం తన ఆరోగ్యం బాలేదని కళాశాలకు వెళ్లకుండా హాస్టల్లోనే ఉంది. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో హాస్టల్ గదిలోని తోటి మిత్రులు వచ్చి తలుపులు తట్టినా తీయలేదు. హాస్టల్ నిర్వాహకులకు సమాచారం ఇచ్చి తలుపులు బద్దలు కొట్టి చూడడంతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే శ్రావణిని సూరారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రావణి తనకు ఆరోగ్యం బాలేదని కడుపునొప్పి కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్ రాసి ఉందని పోలీసులు తెలిపారు. కాగా.. తమ కుమార్తె శ్రావణి ఎంతో ధైర్యవంతురాలు అని, ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని హాస్టల్ నిర్వాహకులే ఏదో చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ.. కళాశాల ఎదుట మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టారు. దుండిగల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పి.. ఆందోళనను విరమింపజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య
- కస్తూర్బా, జ్యోతిబాపూలే విద్యాలయాల సందర్శన


విద్యార్థులతో మట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, నాయకులు

కొడంగల్ రూరల్: గురుకుల పాఠశాలల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల, కస్తూర్బాగాంధీ విద్యాలయంలో శుక్రవారం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం గురుకులాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్యోతిబాపూలే గురుకులానికి ప్రహరీ లేకపోవడంతో కుక్కలు, పాములు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేశారు. కస్తూర్బాగాంధీలో టాయిలెట్, వాటర్ సమస్యలున్నాయని, వీటిని అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహిపాల్, తిరుపతయ్య, రవిగౌడ్, హిరియానాయక్, రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగు చేసుకోవాలి


పశుగ్రాస పెంపకంపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

హైదరాబాద్ ప్రాంతీయ పశుగ్రాస కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అంజు, బాసర

దోమ: పాడి రైతులు పశువులకు మేలైన పశుగ్రాసాలను సాగు చేసుకుంటే పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని హైదరాబాద్ ప్రాంతీయ పశుగ్రాస కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అంజు, బాసర అన్నారు. శుక్రవారం వారు మండల పరిధిలోని శివారెడ్డిపల్లిలో పాడి రైతులకు పశుగ్రాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు మార్కెట్‌లో లభించే దానాల స్థానంలో మేలు రకం గడ్డిని పెంచుకుని పశువులకు మేతగా వేస్తే పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. అధిక పోషక విలువలతో కూడిన స్వల్పకాలిక రకాలు పీపీ 23, దీర్ఘకాలిక రకాలైన కో 29, సూపర్ నేపియర్‌ని సాగు చేసుకోవాలన్నారు. ఇట్టి విత్తనాలు అధిక దిగుబడిని ఇవ్వడమే కాకుండా, బహువార్షిక ధాన్యపు జాతి పశుగ్రాసాలు కావడంతో పశువులకు పోషక విలువలతో కూడిన గ్రాసాన్ని అందించేందుకు వీలవుతుందన్నారు. అనంతరం పలువురు రైతులకు మేలు రకం గడ్డి విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు అర్జున్‌రెడ్డి, మురళీధర్ రెడ్డి, రాంరెడ్డి, విక్రంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కటికే నర్సింహులు, కుర్వరాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

30 తులాల వెండి, నాలుగు గ్రాముల బంగారం, రూ.30వేల నగదు అపహరణ

శంకర్‌పల్లి: గుర్తు తెలియనిన వ్యక్తులు తాళం వేసిన ఇంటికి కన్నం వేశారు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి మండల పరిధిలోని ఎల్వర్తిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు టి.రామలక్ష్మయ్య గురువారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి శంకర్‌పల్లిలో ఆస్పత్రికి వెళ్లాడు. శుక్రవారం ఇంటికి రాగా తాళం పగులగొట్టి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించిన రైతు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు శంకర్‌పల్లి పోలీసులు క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్, సీసీఎస్ పోలీసులతో కలిసి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు ప్రకారం రూ.30వేల నగదు, 30 తులాల వెండి, నాలుగు గ్రాముల బంగారం చోరీ అయిందన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.


కోతి కళేబరాన్ని ఖననానికి తీసుకెళ్తున్న గ్రామస్తులు


ముందు నడుస్తున్న వానర సమూహం

సంప్రదాయంగా వానరం అంత్యక్రియలు

మోత్కూర్ గ్రామంలో వానరాల గుంపు నిత్యం సంచరిస్తుంటాయి. ఇందులో ఓ కోతి కొంతకాలంగా తీవ్ర అస్వస్థతో ఇబ్బంది పడుతూ శుక్రవారం మృత్యువాతపడింది. దీంతో గ్రామస్తులు గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు జరిపారు. స్నానం చేయించి.. నూతన వస్త్రాలు వేసి.. డప్పు చప్పుళ్లతో ఊరేగించి ఖననం చేశారు. కాగా అంత్యక్రియలు జరిపిస్తున్న సమయంలో వానరాల గుంపు అంతిమయాత్రలో ముందు నడిచాయి.

- దోమ